ప్రజాశక్తి
శనివారం 24 మే 2025 | 5 | అనంతపురం





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

అనంతపురం సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో అన్ని విభాగాలకు వైద్యులు, సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని ఎన్జీవో హోంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజా ఆరోగ్య వేదిక అనంతపురం జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మానవ హక్కుల వేదిక చంద్రశేఖర్, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ప్రసన్న, డాక్టర్ వీరభద్రయ్య, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు ఎజి.రాజమోహన్, జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, సామాజిక కార్యకర్త బోస్, సిటిజన్ ఫోరం నాయకుడు సత్యనారాయణరెడ్డి, రచయిత టివి.రెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు జిలాన్, జెవివి తిరుపాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అభివృద్ధిపై ఇది వరకే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి కదలిక లేకపోవడం ప్రజలను ఆందోళన కలిగిస్తోందన్నారు. పేరుకు సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అయినా సరైన సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయంగా ఉందన్నారు. తక్షణమే ఆసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ వైద్య విద్యా కళాశాలల్లో అమలు చేస్తున్న సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల పద్ధతి విధానం ఉప సంహరించుకోవాలన్నారు. పి.పి.పి మోడల్ నిర్ణయం పట్ల పున:పరిశీలించాలని కోరారు. గతంలో ప్రభుత్వం ప్రారంభించిన 17 వైద్య కళాశాలల్లో 10 కళాశాలలను పిపిపి మోడల్‌కి మార్చడం, అలాగే ఈ చట్టం కింద కొత్త కళాశాలలను స్థాపించడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమన్నారు. టిడిపి కూటమి పార్టీలు వైద్య కళాశాలల్లో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్ల ప్రవేశాన్ని వ్యతిరేకించాయని, ఇప్పుడు అధికారంలో ఉన్నప్పటికీ వాటిని అమలు చేస్తామనడం సరికాదని అన్నారు. పిపిపిలు అమలు చేయడం వల్ల రాబోయే ఫలితాలు ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వైద్య విద్యను ప్రైవేటీకరించడం వల్ల వైద్య విద్య ఖర్చులు విపరీతంగా పెరిగి ప్రజలపై భారం పడుతుందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల నుండి వచ్చిన విద్యార్థులకు వైద్యవిద్య అందుబాటులో ఉండదన్నారు. చివరికి నిపుణులయిన ఆరోగ్య సిబ్బంది కొరతపై కూడా ప్రభావం చూపుతుందన్నారు. పిపిపి మోడల్ ప్రజారోగ్యం కంటే కార్పొరేట్ లాభాలకు ప్రాధాన్యత ఇచ్చే ప్రమాదం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం పరిశీలించి అనంతపురం సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఆరోగ్య వేదిక నాయకులు సురేంద్ర, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివారెడ్డి, జనరల్ ఇన్సూరెన్స్ రిటైర్డ్ ఉద్యోగి రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు గాలికి...

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనేక సమస్యలు జిల్లాలో తిష్ట వేసి ఉన్నాయి. వానాకాలమొచ్చినా రైతులకు విత్తనాలు ఎప్పుడు అందుతాయో తెలియని అయోమయం నెలకొంది. మరోవైపు సాగునీరు సక్రమంగా అందుతుందో లేదో అన్న సందేహాలు ఆయకట్టు రైతుల్లో ఉన్నాయి. వైద్యం సక్రమంగా అందటం లేదన్న అసంతృప్తి జనంలో స్పష్టంగా కనిపిస్తోంది. వీటి పరిష్కారంపై నేతలు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. నేతల దృష్టి అంతా స్థానిక సంస్థల్లో అధికార మార్పిడిపైనే ఎక్కువగా ఉందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే కొన్ని స్థానాలను దక్కించుకోగా, మరిన్ని దక్కించుకునే ప్రయత్నాలు జోరుగా నడుస్తున్నాయి. వీటి చుట్టూ రాజకీయాలుంటుండటంతో జనం ఇబ్బందులు గాలికి వదిలేసారన్న ఆరోపణలున్నాయి.

జనం ఇక్కట్లు

ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి వారం రోజులు గడువుంది. సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు బాగా రావడంతో రైతులు దుక్కులు దున్నుకునే పనిలో ఉన్నారు. జూన్‌లో మంచి వర్షాలు పడితే విత్తనం కూడా విత్తుకునేందుకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయి. ప్రకృతి అనుకూలంగా ఉన్నా ప్రభుత్వపరంగా మాత్రం ఇంకా సమయత్తమవలేదు. ఉమ్మడి జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో సాగయ్యే వేరుశనగ పంటకు అవసరమైన సబ్సిడీ విత్తనం పంపిణీ ఎప్పుడన్నది స్పష్టత లేదు. ఇది పంపిణీ చేస్తే రైతులు వాటిని ఒలిచి విత్తనాలను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. ఇక సాగునీటికి సంబంధించి హంద్రీనీవా కాలువ వెడల్పుపైనున్న వేగం తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ మరమ్మతులపై లేదన్న విమర్శలున్నాయి. ఇప్పటికే తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో వస్తున్నాయి. ఇవి పెరిగితే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరు తీసుకునే అవకాశముంది. కాలువ గట్లు బలహీనంగా ఉన్నాయి. నీరు ఎక్కువగా తీసుకునే పరిస్థితులు లేవు. వీటి పర్యవేక్షించేందుకు సూపరింటెండెంట్ ఇంజనీరు లేరు. అంతకు మునుపు ఉన్న ఎస్ఇ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చెందారు. ఇతనితో సాగునీటి నిర్వహణ చేపట్టడం ఎంత వరకు సాధ్యమన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇక వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందటం లేదన్న అసంతృప్తిని ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనే సభ్యులు వెల్లడించారు. పెద్దఎత్తున సమస్యలను లేవనెత్తారు.

అధికార మార్పిడిపైనే నేతల దృష్టి

జనం సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్ష పార్టీలు అధికార మార్పిడిపైనే దృష్టి సారించాయన్న విమర్శలున్నాయి. స్థానిక సంస్థల్లో అత్యధికంగా వైసిపి ఉండేది. వాటన్నింటినీ అధికార టిడిపి వైపు మార్చుకునే ప్రయత్నాల్లోనే ముఖ్య నేతలుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికే మడకశిర, హిందూపురం, కదిరి పురపాలక సంఘాల్లో మార్పులు జరిగాయి. రామగిరి మండల పరిషత్ మార్పు కోసం పెద్దఎత్తున వివాదం నడుస్తూనే ఉంది. వీటి నడుమే అనంతపురం నగర పాలక సంస్థనూ మార్పుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్న ప్రచారం నడుస్తోంది. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకట ప్రసాద్ శుక్రవారం రోజు చేసిన ప్రకటన చర్చనీయాంశం అయింది. కడప మేయరు తరహాలోనే అవినీతి ఆరోపణల పేరుతో తొలగిస్తామని ప్రకటించడం గమనార్హం. అంతకు మునుపు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఛాంబరులోనూ , నగర మేయరు ఛాంబరుల్లోనూ ఫొటోల మార్పుపైనా పెద్ద చర్చ నడుస్తోంది. రాజకీయ పదవుల్లోనున్న వారి చాంబరుల్లో ఎవరి ఫొటోలుండాలన్నది నిర్ణయించడం సాధ్యమవుతుందా అన్న చర్చ రాజకీయాల్లోనూ ఉంటోంది.

ఆధిపత్యం కోసం ఇరుపార్టీల నాయకుల పోరు

స్థానిక సంస్థల కైవసంపైనే దృష్టి



మేయర్ వర్సెస్ అర్బన్ ఎమ్మెల్యే

పరస్పర ఆరోపణలతో దుమ్మెత్తి పోసుకున్న మేయర్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగర పాలకసంస్థ మేయర్ వసీం, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి మధ్య మాటల యుద్ధం జరిగింది. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ లో పారిశుధ్య వాహనాల ప్రారంభోత్సవ వేదిక సాక్షిగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ మేయర్ మహమ్మద్ వసీం సలీం ఒకరిపై మరొకరు వేరువేరుగా జరిగిన కార్యక్రమాలో పరస్పర విమర్శలు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ పారిశుధ్య వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహమ్మద్ సలీం కలిసి డంపింగ్ యార్డ్‌లో 22 కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. వీరి అవినీతి బాగోతం త్వరలో బయట పెడతానని ఎమ్మెల్యే ప్రకటించారు. గత ప్రభుత్వ హయాంలో నగరపాలక సంస్థను భ్రష్టు పట్టించారని విమర్శించారు.. కూటమి అధికారంలోకి వచ్చిన 11 నెలల్లోనే ప్రజలకు నగర అభివృద్ధిని చూపించామన్నారు. ఇదిజరిగిన తరువాత మధ్యాహ్నం 12 గంటల సమయంలో వాహనాల పరిశీలన కార్యక్రమాన్ని మేయర్ మహమ్మద్ వసీం సలీం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన ఎమ్మెల్యేపై తీవ్ర ఆరోపణలు చేశారు. డంపింగ్ యార్డులో టెండర్ వర్క్ 22 కోట్లు కాగా రూ. 22 కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఎమ్మెల్యే ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు ఇటీవలనే రాజకీయాల్లోకి వచ్చిన ఎమ్మెల్యే వాస్తవాలు తెలుసుకోకుండా నోటికొచ్చినట్టు మాట్లాడుతూ చిల్లర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అర్బన్ ఎమ్మెల్యే పార్ట్ టైం ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారన్నారు. ఒక్క రూపాయి నిధులు తీసుకురాకున్నా వైసీపీ హయాంలో మంజూరు అయిన పనులు, తమ పాలక వర్గం ఆమోదించిన పనులు ప్రారంభిస్తూ కూటమి పాలనలోనే నగరంలో అభివృద్ధి జరుగుతోందని ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. డంప్ యార్డ్‌లో మాజీ ఎమ్మెల్యే, తాను అవినీతికి పాల్పడినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతున్నారన్నారు. బిల్లులు చెల్లించిందే రూ.11 కోట్లు లోపు అయితే రూ.9 కోట్ల అవినీతికి ఆస్కారం ఎక్కడ ఉందని ప్రశ్నించారు.విచారణ తర్వాత బిల్లును చెల్లించాలని చెపుతున్న తాము అవినీతికి పాల్పడినట్లా, కాంట్రాక్టర్లకు అనుకూలంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అవినీతికి పాల్పడినట్లా అని ప్రశ్నించారు. ఇప్పటికే తాము అదే నిర్ణయానికి కట్టుబడి ఉన్నామన్నారు. వారి ప్రభుత్వమే అధికారంలో ఉంది కదా త్వరితగతిన విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ఏడాది పాలనలో అర్బన్ ఎమ్మెల్యే చేసిన అవినీతి, అక్రమాల చిట్టా తమ వద్ద ఉందని సందర్భం వచ్చినప్పుడు అన్ని బయట పెడతామని హెచ్చరించారు. పదే పదే తనను డమ్మీ మేయర్ అంటున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పార్ట్ టైం ఎమ్మెల్యే, డమ్మీ ఎమ్మెల్యే అని విమర్శించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఆయన బెదిరింపులకు భయపడే వారు ఎవరూ లేరని స్పష్టం చేశారు.

రూ.2.05 కోట్లతో స్వచ్ఛ వాహనాలు

జెండా ఊపి ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యే



స్వచ్ఛ వాహనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

ఎన్.క్యాప్, స్వచ్ఛాంధ్ర, జనరల్ ఫండ్స్ నిధులు రూ.2.05 కోట్లతో కొనుగోలు చేసిన స్వచ్ఛ వాహనాలను ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు ఈ వాహనాలు ఎంతగానో ఉపయో గపడతాయన్నారు. నగరపా లక సంస్థను కేవలం 11 నెలల్లోనే గాడిలో పెట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్లలో కనీసం చిన్న డ్రెయిన్ తీయ లేదని, రోడ్లు, కాలువలు నిర్మించలేదని విమర్శిం చారు. అంతేగాకుండా నగరంలో ప్లాస్టిక్ విచ్చలవిడి గా కనిపించేదన్నారు. ప్రస్తుతం ప్లాస్టిక్ నిర్మూలనకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామన్నారు. మరోవైపు పిపిపి మోడల్‌లో అనంతపురం మార్కెట్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ విజయభాస్కర్‌రెడ్డి, గంగారామ్, కార్పొరేటర్లు బాలాంజనేయులు, బాబా, లాలెప్ప, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్, ఇఇ షాకీర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారీ నేరం

ప్రజాశక్తి-శింగనమల

నాటుసారాను తయారీ చేయడం, రవాణా, విక్రయించడం నేరమని డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్‌పెక్టర్ సి.నాగ సునీతారాణి హెచ్చరించారు. శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని నాగులగుడ్డం తండాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ నాటుసారా నిర్మూలనలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. అంతేగాండా నాటుసారా చేసి పట్టుబడితే ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పథకం, రేషన్, పింఛను, నిరుద్యోగ ఉపాధి కల్పనకు అనర్హులు గా పరిగణిస్తామని తెలిపినారు వివరించారు. నాటుసారా విక్రయిస్తున్నట్లు తెలిస్తే హెల్ప్‌లైన్ 14405కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.విజయ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ గురురాజభట్, పంచాయతీ సెక్రటరీ, మహిళ పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు

ఉగ్రవాదాన్ని ఐక్యంగా ప్రతిఘటిద్దాం

దేశ సమైక్యత యాత్రల కరపత్రాల ఆవిష్కరణలో సిపిఎం నేతలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఐక్యంగా ఉగ్రవాదాన్ని ప్రతిఘటించి మత సామరస్యాన్ని ప్రజల ఐక్యతను కాపాడుకుందామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులతో కలిసి ఈ నెల 20 నుంచి 30వ తేది వరకు నిర్వహిస్తున్న 'ఉగ్రవాద వ్యతిరేక పోరాటమా- అమెరికాకు లొంగుబాటా- మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ' సమైక్య యాత్రల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి.రాంభూపాల్ మాట్లాడుతూ పెహల్గాంలో ఏప్రిల్ 22న 26 మంది పర్యాటకులను టెర్రరిస్టులు బలిగొన్నారని, ఉగ్రదాడిని ఖండించడంలో దేశ ప్రజానీకం ప్రదర్శించిన ఐక్యత, సమైక్యతా స్ఫూర్తి ప్రజలందరినీ ఒక్క తాటిపై నిలిపిందన్నారు. మనుషులను వారి మతాన్ని తెలుసుకుని హత్య చేయడంద్వారా ఉగ్రవాదులు దేశంలో మతపరమైన విభజనను తీసుకురావాలని, మత విద్వేషాలు రెచ్చగొట్టాలని పథకం పన్నారని తెలిపారు. మన విదేశాంగ కార్యదర్శి మతపరమైన విభజన తీసుకు రావడానికే ఈ ఉగ్రదాడి జరిగిందని స్పష్టంగా ప్రకటించారన్నారు. దేశ ప్రజలు సమైక్యంగా నిలబడి ఈ పథకాన్ని వమ్ముచేశారన్నారు. మతోన్మాద శక్తులకు ఇది నచ్చలేదన్నారు. పాక్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా ఆపరేషన్ సింధూర్‌ను భారత ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కానీ కొన్ని శక్తులు ఉగ్రవాదానికి, మతంతో ముడేసి ప్రజల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని వదిలేసి వక్రబుద్ధితో మతోన్మాదాన్ని, ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టి దేశాన్ని బలహీనపరుస్తున్నారని ఇలాంటి శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కులం, మతం, జాతి భేధం లేకుండా సమాజంలోని అన్ని తరగతుల ప్రజలు ఈ ఘాతుకం పై తీవ్ర నిరసన వ్యక్తం చేశారన్నారు. అంతేకాకుండా ఉగ్రవాద కాల్పుల నుంచి బయట పడిన వారిని కాపాడింది ముస్లిం సోదరులేనని బాధితులు బహిరంగంగా ప్రకటించారన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఈ రాక్షస దాడిని ఏకోన్ముముఖంగా ఖండించాయన్నారు. కాశ్మీర్ ప్రజలు కూడా ఈ హత్యాకాండను ఖండించారని చెప్పారు. ప్రజల సమైక్యత పైన, లౌకిక విలువల పైన ఆధారపడి ఉగ్రవాద వ్యతిరేక పోరాటం సాగాలన్నారు. భారత్, పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణకు సంబంధించిన ప్రకటన ఏక పక్షంగా అమెరికా ప్రకటించిందన్నారు. అమెరికా ప్రకటన ప్రజల్లో ఆందోళనకు గురిచేస్తోందన్నారు. విదేశాంగ విధానాన్ని తుంగలో తొక్కి అమెరికా ఇలా చేయడం సరైంది కాదన్నారు. తృతీయ పక్షం జోక్యం లేకుండా వివాధాలను ద్వైపాక్షికంగా పరిష్కరించుకోవాల్సి ఉందన్నారు. ఆపరేషన్ సింధూర్‌ను జయప్రదం అయిందని ప్రకటించాక కూడా కాల్పులు ఎందుకు కొనసాగాయని ఉన్నటుండి ఎందుకు విరమించారన్న ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం ఇవ్వడం లో ప్రభుత్వం విఫలమైందన్నారు. వాణిజ్య ప్రయోజనాలకోసమే కాల్పుల విరమణ చేసినట్లు ట్రంప్ తాజాగా ప్రకటించాడన్నారు. ఈ మొత్తం ఘటనలపై వెంటనే పార్లమెంటు సమావేశం జరిపి ప్రధాని మోడీ వాస్తవమైన స్పష్టమైన ప్రకటన చేయాలని ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేస్తోందన్నారు. ఉగ్రవాద వ్యతిరేక పోరాటాన్ని రెండు మతాల మధ్య దేశాల మధ్య యుద్ధంగా మార్చవద్దని మొదట నుండి సిపిఐ(ఎం) కోరుతోందన్నారు. దాన్ని పెడచెవిన పెట్టి తన సంకుచిత రాజకీయ ప్రయోజనాలకోసం బిజెపి ఈ ఘటనలను వాడుకోవాలని చూస్తోందని విమర్శించారు. యుద్ధం వద్దన్నందుకు కమ్యూనిస్టులపై దాడి చేస్తున్నారని తెలిపారు. ఇతర దేశాల మద్దతును కూడగట్టడానికి అన్ని పార్టీల ఎంపీలను ప్రతినిధివర్గంగా పంపుతున్న మోడీ ప్రభుత్వం దేశ ప్రజలను, ప్రతిపక్షాలను, కాశ్మీర్ ప్రజలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప మాట్లాడుతూ ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం ప్రాథమికంగా లౌకిక పార్టీ, దేశ సమైక్యతను మత సామరస్యాన్ని, రాష్ట్రాల హక్కులను కాపాడడంకోసం ప్రతిపక్షాలతో కలిసి పోరాడిందన్నారు. కానీ నేడు ఆపార్టీ నిర్వహిస్తున్న పాత్ర దానికి భిన్నంగా ఉందన్నారు. ఎన్డీఏలో భాగస్వామిగా బిజెపి మతోన్మాదానికి వంతపాడుతోందన్నారు. మోడీ ట్రంప్ కు తలొగ్గినా వైసిపి మాట్లాడటం లేదన్నారు. తెలుగుదేశం, వైసిపి, జనసేన పార్టీల్లోని లౌకిక, ప్రజాతంత్ర శక్తులు మతోన్మాదానికి, యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా మత సామరస్యం, దేశ సమైక్యత, రాజ్యాంగ రక్షణ కోసం ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న దేశ సమైక్యత యాత్రల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, ఎం.బాలరంగయ్య, వి.రామిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు వై.వెంకట నారాయణ, ముత్తుజా తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించాలి

కలెక్టర్ వినోద్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - అనంతపురం

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలను అన్ని రకాలుగా అధికారులు ప్రోత్సహించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసేలా మంచి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ (డిస్ట్రిక్ ఇండస్ట్రీస్ మరియు ఎక్స్పోర్ట్ ప్రమోషన్ కమిటీ) సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పరిశ్రమల ఏర్పాటుకు త్వరితగతిన అనుమతులు ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సకాలంలో సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా అన్ని రకాల అనుమతులను అందజేసి పరిశ్రమలు నెలకొల్పేలా చూడాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీలో 21 యూనిట్లకుగాను 62 లక్షల 86 వేల 041 రూపాయల సబ్సిడీ మంజూరుకు ఆమోదం తెలిపారు. స్టాండప్ ఇండియా పథకం కింద లబ్ధిదారులకు రుణాలు త్వరితగతిన మంజూరు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఎల్డిఎంను ఆదేశించారు. విశ్వకర్మ పథకం కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులను అధికారులు గుర్తించాలని, వారికి శిక్షణ, రుణము మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాస యాదవ్, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, సేల్స్ టాక్స్ అసిస్టెంట్ కమిషనర్ కష్టారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, ఎల్‌డిఎం నరేష్ రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ, డ్రగ్స్ ఏడి రమేష్ రెడ్డి, డిటిడబ్ల్యూఒ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించాలి : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో వివిధ యాక్టివిటీలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025పై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2025 యొక్క థీమ్ "ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం" అని అన్నారు. ఇందుకు సంబంధించి మే 22వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ వరకు ప్రతిరోజు వివిధ కార్యాచరణను చేపట్టాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ని అమలు చేయాలని, కార్యాచరణకు సంబంధించిన క్యాలెండర్ ను తయారు చేయాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం మండల, గ్రామస్థాయిలో మానవహారాలు, ర్యాలీలు నిర్వహించాలని, 24 నుంచి జూన్ 5వ తేదీ వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో రామచంద్రారెడ్డి, రేంజ్ అటవీ అధికారి శ్రీనివాసులు, పంచాయతీరాజ్ డిఎల్‌పిఒ విజయ్ కుమార్, డిపిఆర్సి రిసోర్స్ పర్సన్ మాధవి, కోఆర్డినేటర్ అనంత, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రైల్వే ఓపన్ వెయిటింగ్ హాల్ పైకప్పు పడి బాలుడు మృతి

ప్రజాశక్తి గుంతకల్లు

గుంతకల్లు రైల్వే స్టేషన్ లో ఏడవ నెంబర్ ప్లాట్‌ఫాంలో ఓపన్ వెయిటింగ్ హాల్‌లో నిద్రిస్తున్న ఎనిమిదేళ్ల బాలుడుపై పైకప్పు పడటంతో మృతిచెందాడు. శుక్రవారం తెల్లవారు జామున జరిగిన ఈఘటనకు సంబందించిన వివరాలు...కర్నూలు ప్రాంతానికి చెందిన వెంకటేశ్వర్లు శ్రావణి దంపతులు తమ ఎనిమిదేళ్ల కుమారుడు మణికంఠతో కలిసి దైవ దర్శనానికి రామేశ్వరం వెళ్లడానికి గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు గురువారం సాయంత్రం వచ్చారు. తాము వెళ్లే రైలు శుక్రవారం ఉండడంతో ఆ రాత్రి స్థానిక రైల్వే స్టేషన్ లోని ఏడవ నెంబర్ ప్లాట్ ఫారంలోని ఓపెన్ వెయిటింగ్ హాలులో నిద్రించారు. శుక్రవారం తెల్లవారుజామున వెయిటింగ్ హాలు పైకప్పు మణికంఠ అనే బాలుడిపై పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాలుడిని అతని తల్లితండ్రులు వెంటనే సమీపంలోని రైల్వే ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే వారు కనీసం ప్రథమ చికిత్స కూడా చేయకుండా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో వారు మణికంఠను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్ళారు.అక్కడ ఆ బాలుడికి ప్రథమ చికిత్స చేసిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు వెళ్ళాలని వైద్యులు సూచించారు.వెంటనే ఆ దంపతులు తమ ఎనిమిదేళ్ల కుమారుణ్ణి అంబులెన్సులో కర్నూలులోని ప్రయివేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే ఆ బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ కుమారుడు మృతిచెందాడని మృతుడి తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

బాలుడి కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలి:సిపిఎం

రైల్వే అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థానిక రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం - 7లో నిద్రపోతున్న ప్రయాణికుడైన బాలుడు మణికంఠపై సిమెంట్ పెంకులు పడి మరణించడం బాధాకరమని ఆ బాలుడి కుటుంబ సభ్యులకు రూ. 50 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు రైల్వే స్టేషన్లో శుక్రవారం బాలుడిపై పెచ్చులు పడిన ప్రాంతాన్ని సిపిఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి శ్రీనివాసులు మాట్లాడుతూ రైల్వే స్టేషన్లో ఏడవ నెంబర్ ప్లాట్ ఫాంలో ప్రమాదం జరిగి బాలుడు మతి చెందాక ఆ ప్రదేశంలో అధికారులు తమ తప్పుని కప్పు పుచ్చుకోవడానికి యుద్ధ ప్రాతిపదికన దాన్ని మరమ్మతులు చేశారన్నారు. నిర్లక్ష్యానికి పాల్పడిన అధికారులపై రైల్వే ఉన్నత అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకొని మృతిచెందిన బాలుడు కుటుంబానికి రూ. 50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని అలాగే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆ కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్రబాబు, కమిటీ సభ్యులు తిమ్మప్ప, రాము,బుజ్జి,వంశీ,కర్ణ,రాజు తదితరులు పాల్గొన్నారు.



మృతిచెందిన బాలుడు మణికంఠ



బాలుడిపై పడిన సిమెంట్ పెచ్చు

ఐక్య ఉద్యమాలతోనే హక్కుల సాధన



జెండాను ఎగురవేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఐక్య ఉద్యమాలు చేయడం ద్వారానే హక్కులను సాధించుకుంటామని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఓ.నల్లప్ప, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఉన్న సిఐటియు జిల్లా కార్యాలయంలో శ్రీసత్యసాయి తాగునీటి పథకం కార్మికులకు రెండు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను భంగం కలిగిస్తూ కనీస వేతనం, బోనస్, గ్రాట్యుటీ, పిఎఫ్, ఈఎస్ఐ తదితర హక్కులను తొలగిస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలు చేస్తోందన్నారు. ఆయా చట్టాల ద్వారా పాలకుల దయాదాక్షిణ్యాలపై ఉద్యోగ భద్రత ఆధారపడి ఉంటుందన్నారు. ఈ సమయంలో కార్మికవర్గం ఉద్యోగ భద్రత కోసం పోరాటాలు చేయాల్సి వస్తోందన్నారు. దేశంలో పెట్టుబడుదారులు దేశ సంపద, సహజ వనరులను లూటీ చేస్తున్నారన్నారు. కార్మికుల తమ హక్కులను సాధించుకోవాలంటే బలమైన ఐక్య ఉద్యమాలను సమరశీలంగా చేయాల్సి ఉందన్నారు. డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ శాస్త్రీయ ఆలోచనలో ఉన్నది ఉన్నట్లుగా చూసినప్పుడే వాస్తవాలు తెలుస్తాయన్నారు. అప్పుడే నిజమైన వాస్తవం ప్రజలకు అర్థమవుతుందన్నారు. లేదంటే ఏ నినాదం వెనక ఏ వర్గ ప్రయోజనాలు దాగి ఉన్నాయో అర్థం చేసుకోలేనంత కాలం మోసపోతూనే ఉంటామన్నారు. అందుకే వాస్తవాల మీద నిలబడి ప్రశ్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, యూనియన్ జిల్లా నాయకులు ఎర్రిస్వామి, రాము, వన్నూరప్ప, వన్నూరుస్వామి, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల అవినీతి విచారణను తప్పించడానికే చర్యలా..?

మేనేజర్ గా సుజాత నియామకం - ఇన్‌ఛార్జిగా ప్రజారోగ్య విభాగం సూపరింటెండెంట్



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇటీవల జరిగిన రెవెన్యూ విభాగ ఉద్యోగి ఉద్యోగోన్నతిలో రూ.లక్షలు చేతులు మారిన ఉదంతంపై విచారణ జరపకుండానే ఆకస్మికంగా బదిలీలు చేపట్టడంపై పలు విమర్శలకు తావిస్తోంది. ఇన్‌ఛార్జి మేనేజర్‌గా ఉన్న రెవెన్యూ ఆఫీసర్ వన్ లక్ష్మీదేవి స్థానంలో ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ సుజాతను మేనేజర్‌గా శుక్రవారం సాయంకాలం నియమించారు. అలాగే ఆమెను ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా ప్రజారోగ్య విభాగం అదనపు బాధ్యతలు అప్పగించారు. లక్ష్మీదేవికి ఇన్‌ఛార్జి మేనేజర్ బాధ్యతలు తప్పించడం ద్వారా రెవెన్యూ ఆఫీసర్‌గా మాత్రమే విధులు నిర్వహించనున్నారు. అయితే సీనియారిటీకి తిలోదకాలు ఇచ్చి నియమ, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతుల జరిపిన అంశంపై విచారణ చేపట్టకపోవడంపై ఉద్యోగ వర్గాల్లో అసంతృప్తిని సీట్ల మార్పిడి ద్వారా ఉన్నతాధికారి అవినీతి వ్యవహారంపై విచారణ జరపకుండా బాధ్యులను కాపాడటానికి ఈ చర్యలు చేపట్టినట్లు అభిప్రాయపడుతున్నారు. సీనియారిటీ జాబితాలో మొదట ఉన్న వారికి కాకుండా రోస్టర్ పాయింట్‌కు విరుద్ధంగా జాబితాలో అట్టడుగున ఉన్నవారికి పదోన్నతులు కల్పించడం ద్వారా అక్రమాలకు తెరతీశారని వాపోతున్నారు. కిందిస్థాయి అధికారులు అక్రమాలకు అవినీతికి పాల్పడుతుంటే నిరోధించాల్సిన ఉన్నతాధికారి వాటిని రాజకీయ ఒత్తిళ్ళ సాకుగా చూపుతో అక్రమ వ్యవహారాలను ప్రోత్సహించటం వారి స్థాయికి తగదని చర్చించుకుంటున్నారు. కార్పొరేషన్‌లో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో పరిపాలన అస్తవ్యస్తంగా మారి పరపాలనగా మారిందని వ్యాఖ్యానిస్తున్నారు. పాలకవర్గం సైతం అధికార వర్గాల అవినీతి అక్రమ కార్యకలాపాలను చూస్తూ మిన్నకుండిపోవడం దారుణమన్నారు. ఈ వ్యవహారాలను చూసిన వారికి ఎవరికైనా 'కంచే చేను మేసింది' అన్న సామెత అక్షరాల అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు అతికినట్టుగా సరిపోతుందని వ్యాఖ్యానిస్తున్నారు. ఈ అడ్డగోలు పదోన్నతులపై అర్బన్ ఎమ్మెల్యే అనుచరుల ఒత్తిళ్ల సిఫారసులు మేరకే జరిగాయని కార్యాలయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే ప్రతి అవినీతి అక్రమ కార్యకలాపాలు తనకు అంతా తెలుసునని పేర్కొనే ముఖ్య నేత ఈ అంశంపై స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అభిప్రాయపడుతున్నారు. కనీసం ఈ అంశంపై మున్సిపల్ పరిపాలన డైరెక్టరేట్ స్పందించి అడ్డగోలు పదోన్నతులను నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

పెయిడ్ ఇంటర్న్‌షిప్‌నకు గేట్స్ విద్యార్థుల ఎంపిక



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

గుత్తి : గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికయ్యారు. కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న 40 మంది విద్యార్థులు రూ.16 వేల వేతనంతో కూడిన ఇంటర్న్‌షిప్‌నకు ఎంపిక చేశారు. వైద్య రంగంలో ప్రముఖ ఆసా మెడికల్ డివైజెస్ ప్రయివేట్ లిమిటెడ్, బెంగళూరులోని యూటో సంస్థల్లో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ చేయనున్నారని కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఎంపికైన విద్యార్థులు అధునాతన ఇంజినీరింగ్ పద్ధతులు, ఉత్పత్తి అభివృద్ధి, పారిశ్రామిక కార్యకలాపాల్లో ఆచరణాత్మక అనుభవాన్ని పొందుతారన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గుత్తి : పిఎం కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతిలో 60 శాతం ఉత్తీర్ణతతో పాటు గణితం, సైన్స్‌లో 60 శాతం మార్కులు ఉండాలన్నారు. ఈనెల 30వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

27న వాహనాల వేలం

గుత్తి : ఈనెల 27వతేదీన గుత్తి పోలీస్‌స్టేషన్‌లో ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ బి.వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ ద్విచక్ర వాహనాలను బహిరంగ వేలం వేస్తామన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో తహసిల్దార్ సమక్షంలో జరిగే బహిరంగ వేలం పాటకు ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు.

వైద్య సిబ్బందికి సెక్టార్ మీటింగ్

ఉరవకొండ : మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పావని ఆధ్వర్యంలో శుక్రవారం సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా రికార్డులు తనిఖీ చేసి నెలవారీ రిపోర్టులను సేకరించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ మతాశిశు సంరక్షణ సేవల శాతం పెంచాలన్నారు. వీటితోపాటు అసంక్రమిత వ్యాధుల సర్వే వేగవంతం చేయాలని, అబా ఐడిలో త్వరితగతిన నమోదు చేయాలని, క్షయ వ్యాధి సర్వే చేయాలని సూచించారు. గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు జరగకుండా, భ్రూణ హత్యలకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలను నిరోధించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఎఎన్‌ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దు

ఎఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

గ్రామాల్లో భూ తగాదాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి సూచించారు. శుక్రవారం పెద్దవడుగూరులోని తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో తహశీల్దార్ ఉషారాణి ఆధ్వర్యంలో చేపట్టిన భూసమస్యలపై ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ తగాదాలతో జీవితాలను నాశనం చేసుకోరాదన్నారు. కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమిష్టిగా పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రస్తుతం రీసర్వే జరిగిన కొన్ని గ్రామాల్లో ఒకే సర్వేనెంబర్‌పై అధికమంది రైతులు ఉన్నప్పటికీ వారందరూ ఒకేసారి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఇక నుంచి జరగబోయే రీసర్వే గ్రామాల్లో ఇలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, ఆర్ఐ లహరిక, సర్వేయర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'సీమ' అభివృద్ధిపై మహానాడులో తీర్మానం చేయాలి

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి
కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వై.మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రాయలసీమ అభివృద్ధిపై కడప జిల్లాలో నిర్వహించనున్న తెలుగుదేశం పార్టీ మహానాడులో తీర్మానం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకూ సాగునీరు అందించాలన్నారు. అదేవిధంగా హైకోర్టు, మానవ హక్కుల ట్రిబ్యునల్ కార్యాలయాలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. రాయలసీమ నుంచి అత్యధిక మంది ముఖ్యమంత్రులు అయినప్పటికీ అభివృద్ధికి మాత్రం నోచుకోలేకపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కృష్ణాజలాలను రాయలసీమకు తీసుకొచ్చి శాశ్వతంగా కరువు నుంచి విముక్తి కలిగించాలన్నదే దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు ఆలోచన విధానం అఅన్నారు. ఆయన ఆశయాలను దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ముందుకు తీసుకెళ్లారన్నారు. ఇందులో భాగంగానే హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా జీడిపల్లి వరకూ నీటిని తీసుకొచ్చామన్నారు. మొదటి దశ పనులు 2012 నాటికి పూర్త యినప్పటికీ తర్వాత వచ్చిన పాలకులు డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తి చేసి ఆయకట్టుకు నీరు అందించలేకపోయారన్నారు. రాయలసీమ ప్రజలు ఎన్నో ఆశలతో మరోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి చేశారని, వారి ఆశయాలకు పని చేయాలన్నారు. హంద్రీనీవా కాలువకు సంబంధించి మొదటి దశ కింద పనులు పూర్తయిన ప్రాంతంలో డిస్ట్రిబ్యూటరీ పనులను వెంటనే పూర్తి చేసి ప్రతి ఎకరాకు కూడా సాగునీటిని అందించాలన్నారు. ప్రధానంగా ఉరవకొండ ప్రాంతంలో లక్ష ఎకరాలకు సాగునీటిని అందించేందుకు వేగవంతంగా చర్యలు చేపట్టాలన్నారు. హంద్రీనీవా గాలేరి నగరి ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసి రాయలసీమ జిల్లాలకు 100 టీఎంసీల కృష్ణా జలాలు తీసుకురావాలన్నారు. హంద్రీనీవా కాలువను పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయాలన్నారు. లైనింగ్ పనుల వల్ల రైతులకు ఎలాంటి ఉపయోగం లేదని, వెంటనే పనులను ఆపాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలన్నింటినీ మహానాడులో చర్చించి తీర్మానాలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి సోనియాసీనా, జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్, వడ్డే సీనా, షోయబ్, చంద్ర, హరి, పవన్, రవి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రుక్మిణీ పాండురంగ రథోత్సవం



రథంలో ఊరేగుతున్న పాండురంగస్వామి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో వెలసిన పవిత్ర పుణ్యక్షేత్రం రుక్మిణీ పాండురంగ స్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా సాగింది. వైశాఖ ఏకాదశిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాండురంగ స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ నబిరసూల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి

బొమ్మనహాల్ : మండల పరిధిలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించడంతోపాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కురవల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు సమయానికి అనుగుణంగా విధులు నిర్వహించాలన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో బంగారు భవిష్యత్తు

ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ



శింగనమలలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ, అంగన్వాడీలు

ప్రజాశక్తి-శింగనమల

విద్యతోనే కిశోర బాలికలకు బంగారు భవిష్యత్తు సాధ్యమని ఐసిడిఎస్ సిడిపిఒ ఉమాశంకరమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో వేసవి సెలవులలో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పోషకాహారం, ఆరోగ్యం, రుతుక్రమ సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, చట్టాలు, హక్కులు, బాల్యవివాహాల వల్ల కలిగే అనార్థాలు, వృత్తి విద్య, పోక్సో చట్టం, జీవనోపాధి, డయల్ 100, 1098, 112, గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన, చెరువుల, బావులు, ఈతకు వెళ్లే దగ్గర జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, కౌసల్య, వాణిశ్రీ, ఉమాదేవి, మహిళా పోలీస్ శిల్ప, అంగన్వాడీ ఆయాలు, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.




పెద్దమల్లేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

యల్లనూరు : వేసవి శిక్షణలో భాగంగా మండల పరిధిలోని పెద్ద మల్లేపల్లి గ్రామంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజామణి ఆధ్వర్యంలో శుక్రవారం కిషోర వికాసంపై ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్య, వైద్యం, వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కులు, చట్టాలు, బాల్య వివాహాలు, తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పూడిక తీయాలి

సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్



వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని చిన్న, పెద్ద మురికి కాలువల్లో పేరుకు పోయిన పూడికను తీయించాలని సిపిఎం పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం వచ్చిందంటే పట్టణంలో చిన్నపాటి వర్షానికి కాలువలు నిండి ఇళ్లు, రోడ్లపైకి మురికినీరు వస్తోందన్నారు. దీం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అంతేగా కుండా వ్యాధులు ప్రబలి అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో యుద్ధ ప్రాతిపదికన పట్టణంలోని మురికి కాలువల్లో పూడికను తీసి ప్రజలు ఇబ్బందులు, అనారోగ్యాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల ను కలుపుకుని మున్సిపల్ కార్యాల యం ఎదుట ఆందోళనలు చేపడతా మని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, సురేంద్ర, రంగమ్మ, పట్టణ కమిటీ సభ్యులు తిమ్మప్ప, అబ్దుల్లా, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం

యల్లనూరు : కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు జూన్ 5న పర్యావరణ దినోత్సవం నాటికి ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించేందుకు చర్యలు తీసుకుందామని ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్లాస్టిక్ వాడకం వద్దని, ఆరోగ్యమే మహా భాగ్యమన్నారు. ప్లాస్టిక్ కవర్లు, పేపర్లకు బదులు జెట్, పేపర్ బ్యాగులను వాడాలని సూచించారు.

రేషన్ పంపిణీపై విచారణ

బొమ్మనహాల్ : మండల పరిధిలోని తారకాపురంలో రేషన్ దుకాణంలో నిత్యావసర సరుకులను సక్రమంగా పంపిణీ చేయడం లేదన్న ఫిర్యాదుపై తహశీల్దార్ మునివేలు శుక్రవారం వచారణ చేపట్టారు. ఇందులో భాగంగా విఆర్‌ఒ శృతితో కలిసి రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తూకాలు తక్కువగా ఇస్తున్నారని, వేలిముద్రలు సక్రమంగా పడకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోయారు. అంతేగాకుండా ఒంటరి మహిళలు, వృద్ధులు, వికలాంగులు ఇంటి వద్దకే వచ్చి రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన



వాటర్ కన్సర్వేషన్ పనులు పరిశీలిస్తున్న ఎంపిడిఒ నందకిషోర్

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

మండల పరిధిలోని పిల్లలపల్లి ఫారెస్ట్‌లో వాటర్ కన్సర్వేషన్ పనులను ఎంపిడిఒ నందకిశోర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పది రోజుల క్రితం జిల్లా ఫారెస్ట్ అధికారి విగ్నేష్ పలు ఫారెస్టు ప్రాంతాలను పరిశీలించి వన్యమృగాలు చనిపోవడం, వాటికి నీటి సౌలభ్యం, ప్లాంటేషన్ చెట్లు పరిశీలన, నూతన స్థల పరిశీలన తదితర అంశాలపై పరిశీలించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలోనైనా అడవి వన్యప్రాణులకు చెక్‌డామ్, కుంటలు, ట్రెంచులు ఏర్పాటు చేయాలని కోరడంతో వాటి పనుల పరిశీలన విషయమై తనిఖీ చేశారు. ఆయన వెంట ఎపిఒ రవి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాజు, తదితరులు ఉన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం తనిఖీ

బుక్కరాయసముద్రం : మహిళల కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎంపిపి దాసరి సునీత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కుట్టుమిషన్ల పనితీరుపై ఆరాతీశారు. మిషన్లు సరిగా పని చేస్తున్నాయా.. లేదా.. అని స్వయంగా పరిశీలించారు. శిక్షణ పొందుతున్న మహిళలు తక్కువ సమయంలోనే ఎంతో నైపుణ్యం కనబరచడంపై ఎంపిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలు ఇంత మంచి అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

కలెక్టర్ వినోద్‌కుమార్



ఆసుపత్రిలోని సమస్యలను వైద్యులు శివకార్తీక్‌రెడ్డిని అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వినోద్‌కుమార్


ప్రజాశక్తి-పామిడి

ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు వైద్యులు, సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు, డాక్టర్లు, సిబ్బంది, మందులు, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరాతీశారు. ఆసుపత్రికి ఎక్కువమంది రోగులు వస్తున్నారు.. శస్త్రచికిత్సలు, సర్జికల్ ప్రొసీజర్స్ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే సామాజిక ఆరోగ్య కేంద్రంలోని వాటర్ సంప్, తాగునీటి ట్యాంకు, పోస్టుమాస్టర్ గది, బయో మెడికల్ వేస్ట్ రూమ్, మందులు ఇచ్చే గది, ఫార్మసీ స్టోర్ రూమ్, ఒపి, ఆపరేషన్ థియేటర్, ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల, పీడియాట్రిక్ వార్డు, మాతాశిశు కేంద్రం, తదితర వార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని వైద్యులకు సూచించారు. బయోవేస్ట్‌ని కాల్చరాదన్నారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్‌ఎస్ డా.పాల్ రవికుమార్, తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, మెడికల్ అధికారి డాక్టర్ శివకార్తీక్‌రెడ్డి, డాక్టర్ మహేష్, హెడ్‌నర్స్ శివకుమారి, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, డాక్టర్లు, నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

50 పడకలను ఏర్పాటు చేయాలి

స్థానిక ప్రభుత్వాసుపత్రిలో 50 పడకలు ఏర్పాటు చేయాలని భారతీయ భీమ్ సేన రాష్ట్ర అధ్యక్షులు పామిడి సాకే ఓబులేసు, వ్యవస్థాపకులు జై భీమ్ రామాంజనేయులు, తదితరులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే కలెక్టర్‌కు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిడి సూరిబాబు, బోయ శివ, జాఫర్, కనుంపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఛేంజ్ ఫర్ సొసైటీ టీమ్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న ఛేంజ్ ఫర్ సొసైటీ సభ్యురాలు

రాయదుర్గం : నియోజకవర్గ పరిధిలోని అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఛేంజ్ ఫర్ సొసైటీ టీంను బెస్ట్ బ్లడ్ డోనర్ అవార్డు వరించింది. ఛేంజ్ ఫర్ సొసైటీ టీం రక్తదానానికి ప్రాధాన్యత ఇస్తూ, మూడు రాష్ట్రాల్లోని అనేక ఆసుపత్రులో గర్భిణీ, ప్రమాద బాధిత, తలసీమియా పిల్లల రక్త అవసరాలు తీరుస్తూ, రక్త సేవలు అందిస్తోంది. ఈ సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర యాదాద్రి జిల్లా ముత్కూర్ మండలం తాటిమట్ల గ్రామ మాతృదేవోభవ, పితృదేవోభవ ఫౌండేషన్ వాళ్లు అందించిన 2025 బ్లడ్ డోనార్ అవార్డును శుక్రవారం ఛేంజ్ ఫర్ సొసైటీ సభ్యులు రోజా, భారతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు, రెండు రాష్ట్రాల్లో రక్తసేవలు అందిస్తున్న సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ తాడిపత్రి జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. No:444/2022

Between:

యస్.సూర్యనారాయణ రెడి S/o చిన్న నారాయణ రెడ్డి,
యస్.తిమ్మాపురం గ్రామం, పుట్లూరు మండలం,
అనంతపురం జిల్లా. మరియు నలుగురు ...వాదులు

ఎదిరి

డి.శివనారాయణ రెడ్డి మరియు 14 మంది ...ప్రతివాదులు
D7: జె.రామాంజినేయులు S/o వెంకటయ్య D.No:2/976-2,
జయనగర్ కాలనీ, తాడిపత్రి టౌన్, అనంతపురం జిల్లా.

ఏడవ ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలో వాదులు ప్రతివాదులైన మీ పైన డిక్లరేషన్ "రైట్ అండ్ టైటిల్" దావా దాఖలు చేసి యున్నారు. పై విషయములో నీ హాజరు నిమిత్తము కోర్టు వారు 25-06-2025వ తేదిన వాయిదా వేసియున్నారు. పై తేదిన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు ఎదుట స్వయంగా కాని, వకీలు ద్వారా కాని హాజరై అభ్యంతరములు తెలుపుకొనవచ్చును.లేని యెడల నీ పరోక్షమున తీర్మానించెదరు.

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

సి.రమేష్‌నాథ రెడ్డి,
కె.శంకర్ రెడ్డి,
డి.శివరామకృష్ణ,
వాదులతరుపు న్యాయవాదులు,
తాడిపత్రి

మెరుగైన పారిశుధ్యానికి సహకారం అందించండి

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వినతి



స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో మెరుగైన పారిశుధ్యం అవసరమైన కార్మికులతోపాటు వాహనాలను పెంచేందుకు చర్యలు చేపట్టాలని టిడిపి సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద కోరారు. ఈమేరకు శుక్రవారం ఉరవకొండకు వచ్చిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఊర్మిళాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేశవానంద మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ఉరవకొండ జనాభాతోపాటు కొత్త కొత్త కాలనీలు వేగవంతంగా విస్తరించాయన్నారు. ఇంత పెద్ద మేజర్ గ్రామపంచాయతీలో ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, ఆరోగ్యం అందించడానికి సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అంతేకాకుండా పారిశుధ్యానికి ఉపయోగించే ట్రాక్టర్లు, గార్బేజీ మిషన్, ట్రై సైకిళ్లు, కంపాక్ట్ ట్రక్కు, మినీ జెసిబి, స్వీపింగ్ మిషన్లు అదనంగా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజేష్, వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్, చేజాల ప్రభాకర్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పలలో తిరంగా ర్యాలీ

నార్పల : మండల కేంద్రంలో శుక్రవారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్ వరకూ సాగింది. ర్యాలీలో యువకులు, సామాజిక సేవా కార్యకర్తలు, విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టిడిపి నాయకులు ఆకుల విజయ్‌కుమార్ (బాబు) మాట్లాడుతూ దేశ రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఆపద సమయంలో దేశ రక్షణ కోసం కుల మతాలకతీతంగా ప్రతి భారతీయుడు ప్రాణ త్యాగానికి సైతం సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు, విద్యార్థులు, సామాజిక సేవా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, నాయకులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



లారీలోనే ఇరుక్కున్న మృతదేహం

ఉరవకొండ : విడపనకల్లు మండలంలోని పెంచలపాడు వద్ద 67 జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ ఈరన్న అక్కడికక్కడే మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రంలోని కంప్లీ నుంచి గుంతకల్లు వైపునకు వస్తున్న లారీ విడపనకల్లు మండలం పెంచలపాడు గ్రామం సమీపంలోకి రాగానే టైర్ పంచర్ కావడంతో డ్రైవర్ ఈరన్న కిందకు దిగి లారీ వెనుక రాళ్లు అడ్డుగా పెట్టడానికి వెనుక వైపునకు వెళ్లాడు. అదే సమయంలో బళ్లారి వైపు నుండి గుంతకల్లుకు వస్తున్న లారీ ముందున్న లారీని గుర్తించకుండా వేగంగా వచ్చి ఢీకొనడంతో రెండు లారీల మధ్యలో ఈరన్న ఇరుక్కొని అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసుకున్న విడపనకల్లు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.